ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జయశంకర్ **భూపాలపల్లి** 5 **ములుగు**

బుధవారం 7 ఫిబ్రవరి 2024

పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్



పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్ నడుస్తోంది. తాము సిఫారసు చేసిన వారికే పోస్టింగులు ఇవ్వాలని మంత్రులు పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తుంటే.. తమ నియోజకవర్గాల్లో వారి పెత్తనమేంటని ఎమ్మెల్యేలు గుర్రుమంటున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు బదిలీలు మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలుగా మారాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఉమ్మడిజిల్లాలోనూ పోలీసుల పోస్టింగుల్లో రాజకీయ నేతల సిఫారసులు కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్నాయి. దీంతో కొద్ది రోజుల నుంచి నేడు, రేపు పోలీసుల బదిలీలు అంటూ ప్రచారం జరుగుతున్నా.. పోస్టింగులు మాత్రం ఎవరికీ ఇవ్వడం లేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే బదిలీలకు బ్రేకులు పడుతున్నట్టు సమాచారం.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

- నియామకాల భర్తీకి పోటాపోటీగా సిఫారసు లేఖలు
- ఒకే పోస్టుకు మంత్రి, ఎమ్మెల్యేల సిఫారసులు
- తమ నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోవద్దంటూ మంత్రులపై ఎమ్మెల్యేల గుర్రు
- వరంగల్ కమిషనరేట్‌తో పాటు జిల్లాలోనూ ఇదే తంతు
- ఎవరి మాట వినాలో తెలియక తల పట్టుకుంటున్న పైఅధికారులు
- పైరవీలు లేక లూప్ లైన్‌కే కొంతమంది పోలీసులు అధికారులు

వరంగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ఎస్పీ కార్యాలయాలున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గెలిచిన ఎమ్మెల్యే లు, మంత్రులు తమకు నచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ప్రధానంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలో ఉన్న 45పోలీస్ స్టేషన్లతో పాటు రెండు మహిళ, మూడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఉన్న ఎస్ఐలు, సీఐలు, ఎనిమిది మంది ఏసీపీలు, ముగ్గురు డీసీపీల్లో అనేక మందికి స్థానచలనం కల్పించేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేపట్టారు. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో కూడా ఎస్ఐ, సీఐ. డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టి సారించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే బదిలీలు చేస్తే ప్రజల్లో తప్పుడు సంకేతాలు పోతాయని, కొద్ది రోజుల వరకు బదిలీల జోలికి వెళ్లవద్దని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సూచించటంతో ఎమ్మెల్యేలు కొద్ది రోజులు వెనక్కుతగ్గారు. అయితే ఇటీవల బదిలీ పర్వం మొదలవడంతో పొలిటికల్ సిఫారసు లేఖలతో పోలీసులు తమ బదిలీల కోసం ఉన్నతాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అయిష్టంగా కొన్ని బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి వస్తున్న సిఫారసు లేఖలు పోలీసు ఉన్నతాధికారులకు తలనొప్పులు తెచ్చిపెడు తున్నాయట. ఒకే పోస్టింగ్ కోసం రెండు మూడు సిఫారసు లేఖలు వస్తుండటంతో ఎవరు సూచించిన వారికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియక పోలీసు ఉన్నతాధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న చర్చ జరుగుతోంది.



బదిలీల్లో పొలిటికల్ వార్..

ఏ శాఖలో లేనివిధంగా పోలీసు పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదేళ్లుగా కాంగ్రెస్ నేతలు అధికా రానికి దూరంగా ఉండటంతో తమకు అను కూలంగా ఉన్నవారికి పోస్టింగులు ఇప్పించుకునేం దుకు పోటీ పడుతున్నారనే ఆరోపణలున్నాయి. పోలీసు పోస్టింగుల్లో ఎమ్మెల్యేల సిఫారసులతో పాటు మంత్రులు కూడా సిఫారసు లేఖలు ఇస్తుండటంతో పొలిటికల్ వార్ ముదురుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలో ఓ పోలీస్ స్టేషన్‌లో సీఐ పోస్టింగ్ కోసం స్థానిక అధికార పార్టీ నేత ఓ సిఫారసు లేఖ ఇవ్వగా, అదే స్టేషన్ కోసం ఓ మంత్రి కూడా రెకమండ్ చేస్తూ లేఖ ఇచ్చారు. అలాగే పరకాల నియోజకవర్గం పరిధిలోని నగరానికి సమీపంలో ఉన్న ఓ పోలీస్ స్టేషన్‌కు ఓ సీఐ పేరును సూచిస్తూ రాష్ట్ర మంత్రి ఒకరు సిఫారసు లేఖ ఇవ్వగా, ప్రస్తుత సీఐనే కొనసాగించాలని స్థానిక ఎమ్మెల్యే పట్టు బడుతున్నట్టు సమాచారం. నగరంలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఏసీపీలు, సీఐ, ఎస్ఐల బదిలీల్లో ఓ మంత్రి జోక్యంపై స్థానిక ఎమ్మెల్యే గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నర్సంపేట నియోజకవర్గంలోని ఓ సీఐ బదిలీలో మరో మంత్రి జోక్యంపై స్థానిక నేతలు నారాజ్‌గా ఉన్నట్లుగా సమాచారం. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐ, సీఐ, ఏసీపీ బదిలీల్లో ఓ మంత్రి జోక్యంపై స్థానిక కాంగ్రెస్ నేతలు అలకవహిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఓ పోలీస్‌స్టేసన్ సీఐ పోస్టింగు కోసం మరో మంత్రి సిఫారసు చేయడంపై స్థానిక ఎమ్మెల్యే కినుక వహించినట్టు చర్చ జరుగుతోంది. భూపాలపల్లి జిల్లాలో ఎమ్మెల్యే సిఫారసు చేసిన సీఐ పోస్టుకు మంత్రి కూడా మరో పేరును సూచించారని సమాచారం. ఇలా కమిషనరేట్‌తో పాటు జిల్లాలో పోలీసుల పోస్టింగుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు

మిగతా 8వ పేజీలో..

పైరవీ లేకుంటే లూప్‌లైన్‌లోకే..

ఏ పార్టీ అధికారంలో ఉన్నా కొందరు నిజాయితీగా పని చేసే అధికారులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పడం లేదు. కానిస్టేబుల్ నుంచి ఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడు స్తున్నాయనే ఆరోపణలున్నాయి. అన్ని శాఖల కంటే పోలీసుశాఖలోనే అధికంగా బదిలీలపై రాజ కీయ ఒత్తిళ్లు ఉంటాయనే చర్చ ఉంది. దీంతో డ్యూటీని నిజాయితీగా నిర్వహించే కొంత మంది అధికారులు, పైరవీలు చేయటం ఇష్టం లేని అధికారులకు లూప్ లైన్ డ్యూటీలు తప్ప వనే చర్చ జరుగుతోంది. హనుమకొండ నగర శివారులో పని చేస్తున్న ఓ సీఐ ఏడాది క్రితమే పోస్టింగ్ వచ్చింది. నాలుగేళ్లు లూప్‌లైన్‌లో కొన సాగిన సదరు సీఐకి తాజా బదిలీల్లో పైరవీలు చేసుకునేందుకు ఇష్టం లేకపోవడంతో తిరిగి లూప్‌లైన్‌కు వెళ్లాల్సి వస్తుందనే ప్రచారం జరుగుతోంది.

ఇలా అనేక మంది పోలీసు అధికారులు నిజాయితీగా పని చేసినప్పటికి, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్‌లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగు తుంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొంతమంది పోలీసుల నుంచి వినిపిస్తోంది.

మహాజాతరకు.. నేడు అంకురార్పణ

మేడారంలో గుడిమెలిగే పండుగకు సర్వం సిద్ధం

జాతర ముగిసే వరకు వడ్డెల కఠిన ఉపవాసం



మేడారంలోని సమ్మక్క ఆలయం, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు బుధవారం అంకురార్పణ జరగనుంది. ప్రధానమైన గుడిమెలిగే పండగను వడ్డెలు (పూజారులు) నిర్వహించనుండగా.. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మేడారం మహాజాతరకు రెండు వారాల ముందు రెండు ప్రధాన పూజా ఘట్టాలను నిర్వహిస్తారు. మొదటిది గుడి మెలిగే పండుగ కాగా, రెండోది మండ మెలిగే పండుగ. గుడి మెలిగే పండుగను బుధవారం ఘనంగా నిర్వహిస్తారు. జాతరలో భక్తుల పూజలందుకునే ప్రధాన దేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పూజా మందిరాలు గతంలో గడ్డి గుడిసెలుగా ఉండేవి. రెండేళ్లకోసారి జరిగే మహాజాతరకు రెండు వారాల ముందు పాతబడ్డ పైకప్పు, కర్రలను తొలగించేవారు. వాటి స్థానంలో కొత్త కర్రలు, దూలాలు, పైకప్పుపై గుట్ట గడ్డిని కప్పేవారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారంగా దైవాలకు పూజలు చేసి గుడి శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించేవారు. దీనినే గుడిమెలిగే పండుగగా పిలుస్తారు. కాలక్రమంలో గడ్డి గుడిసెల స్థానంలో శాశ్వత ప్రాతిపదికన పూజా మందిరాలు నిర్మితమయ్యాయి. అయినప్పటికీ సంప్రదాయాల కొనసాగింపుగా పూజారులు గుడిమెలిగే తంతును జరుపుతూ వస్తున్నారు. బుధవారం ఉదయం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్లలోని పగిడిద్దరాజుల ఆలయాల్లో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేయనున్నారు. తర్వాత దూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. అనంతరం జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరాలను దర్శించుకుంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా ఉపవాసంతో ఉండి గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చి మందిరం పైకప్పుపై వేస్తారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజామందిరాలలోని దేవతల గద్దెలను అలుకు పూతలు చేస్తారు. రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరిస్తారు. జాతర ప్రారంభ సూచికగా తొలిపూజ జరుగుతుండటంతో బుధవారం వనదేవతల గద్దెలను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు మేడారం తరలిరానున్నారు. వచ్చే బుధవారం(14వ తేదీన) ప్రధానమైన మండమెలిగే పండగ జరగనుంది. ఆ రోజు మేడారానికి నలువైపులా ద్వారబంధనాలు, రక్షా తోరణాలు కడుతారు. పూజామందిరాలలోని సామగ్రిని శుభ్రం చేస్తారు. మహాజాతర నిర్విఘ్నంగా జరగాలని, వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు క్షేమంగా గమ్యస్థానాలు చేరాలని వేడుకుంటూ వడ్డెలు గ్రామ, పొలిమేర దేవతలకు సంప్రదాయ పూజలు చేస్తారు. 21వ తేదీ నుంచి 24 వరకు మహాజాతర జరుగుతుండగా ఇప్పటి నుంచే వడ్డెలు కఠిన నియమాలు పాటిస్తారు. నిష్ఠతో కఠిన ఉపవాసం పాటిస్తారు. జాతర ముగిసిన తర్వాత వారం రోజులకు తిరుగువారం పండుగను నిర్వహించారు. జాతర ముగిసినట్టు ప్రకటిస్తారు.

రామప్ప ఆలయ పరిసరాల్లో జంతుబలి నిషేధం

వెంకటాపూర్ (రామప్ప), ఫిబ్రవరి 6: మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం పరిసరాల్లో జంతుబలిని నిషేధించినట్లు ఈవో బిల్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఎవరైనా జంతువులను బలిచేయడం, మాంసం విక్రయించడం, మాంసభక్షణ చేయడం, మద్యపానం సేవించడం వంటివి చేపడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై చల్ల రాజు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కులాలు, మతాలకతీతంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈనెల 3న హనుమకొండలోని ఓప్రైవేట్ క్రిస్టియన్ మైనారిటీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రామప్ప సందర్శనకు వచ్చారని తెలిపారు. రామప్ప పరిసరాల్లో తమ వెంట తీసుకొచ్చిన మాంసాహారాన్ని తింటుండడాన్ని స్థానికులు వీడియోలు తీసి ఓగ్రూపులో పోస్టు చేయడంతో వైరల్ అయిందని అన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇలాంటి సంఘనలు దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి గానీ ఒక మతాన్ని రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిం చొద్దని అన్నారు. అలాగే చేస్తే గ్రూప్ అడ్మిన్లపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొండాయి వరద బాధిత కుటుంబానికి పరిహారం



రషీద్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న తహసీల్దార్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 6 : గత ఏడాది వర్షాకాలంలో సంభవించిన వరదకు మండల పరిధి కొండాయి గ్రామంలోని జంపన్నవాగులో గల్లంతై మృతి చెందిన రషీద్ ఖాన్ కుటుంబానికి ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. రూ. 5 లక్షల చెక్కును తహసీల్దార్ ఖాజామొయినుద్దీన్ మంగళవారం అందజేశారు. జూలైలో వరద బీభత్సానికి కొండాయి గ్రామంతా నీటమునిగిన విషయం విదితమే. ఆ సమయంలో రషీద్ గల్లంతై మృతి చెందాడు.

బీఆర్ఎస్ పాలనలో ఎత్తిపోతలు నిర్వీర్యం



బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ భవేష్ మిశ్రా

పలిమెల లిఫ్ట్ ఇరిగేషన్‌పై నిర్లక్ష్యం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఫైర్

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆర్టీసీ కొత్త సర్వీసు ప్రారంభం

మహదేవపూర్ రూరల్ (పలిమెల), ఫిబ్రవరి 6 : రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. పలిమెల ఎత్తిపోతల పథకమే ఇందుకు నిదర్శనమని దుయ్యబట్టారు. మంత్రి పర్యటన రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. పలిమెల మండల కేంద్రంలో సోమవారం రాత్రి బస చేసిన ఆయన భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రెండు ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ.6కోట్లతో 900ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే పలిమెల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశామని తెలిపారు. ట్రయల్‌రన్ కూడా నిర్వహించగా గత ప్రభుత్వం దాన్ని మరుగున పడేసిందని దుయ్యబట్టారు. దీంతో రైతులకు నిరాశే మిగిలిందన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌ను పునరుద్ధరించి రైతుల కలలను సాకారం చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు ప్రతిపాదనలను రూపొందించాలని నీటిపారుదల శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వంటి ఉపయోగం లేని ప్రాజెక్టులు కట్టి ప్రజా ధనాన్ని దుర్వినియోగపర్చారని, ప్రజల నుంచి వచ్చే పన్నులు ప్రజలకే ఉపయోగపడేలా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.

ప్రజాకాంక్షను పట్టించుకోని బీఆర్ఎస్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాకాంక్షను పట్టించుకోలేదని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. 2018లో అధికారంలో వచ్చిన ఆ పార్టీ 36 రోజుల వరకు ప్రమాణ స్వీకారం చేయలేదని గుర్తు చేశారు. తాము మాత్రం వారం రోజుల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలతోపాటు మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేరుస్తామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేశామని అన్నారు. ఈనెల 8,9 తేదీల్లో మరో రెండు పథకాలను అమలు చేయనున్నట్టు తెలిపారు. తమ పాలనలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌ను విమర్శించడం హాస్యాస్పదమని అన్నారు. ప్రజలు మార్పు కోరి కాంగ్రెస్‌కు అవకాశం కల్పిస్తే తామేదో వారి వద్ద నుంచి అధికారం లాక్కున్నట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి వెళ్లినప్పటికీ ఆర్థిక క్రమశిక్షణతో పథకాల అమలుకు కృషి చేస్తున్నామని అన్నారు. తన పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పలిమెల మండల కేంద్రంలో రూ.65 లక్షలతో సమీకృత మండల కార్యాలయ భవనం, రూ.32 లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాలు, రూ.1.43కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పలిమెల నుంచి హనుమకొండ కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. పలిమెల నుంచి పంకెన వరకు బస్సులో ప్రయాణించారు. ఆ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. సిలబస్, విద్యాబోధన తీరుపై అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ విద్యాబోధనకు సంబంధించి పాఠశాలకు మూడు స్క్రీన్లు రాగా వాటిని ఎలా వినియోగిస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ విద్యాబోధనపట్ల విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు.

ఈకార్యక్రమంలో ఎంపీపీ కురుసం బుచ్చక్క, ఎంపీటీసీ దందెర కల్యాణి, యువజన కాంగ్రెస్ నాయకులు విలాస్‌రావు, దందెర రాజేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమ్మె నోటీసు

డీఎంహెచ్‌వోకు అందజేత

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఆశా కార్యకర్తలు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్యకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 16న గ్రామీణ భారత్‌బంద్‌లో పాల్గొంటామని పేర్కొన్నారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ జాబ్‌చార్ట్‌లేని డ్యూటీలు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పేరుతో ఆశా కార్యకర్తలపై కేంద్ర ప్రభుత్వం పని భారం పెంచుతోందని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రెండు నెలల పెండింగ్ పారితోషికాలు చెల్లించాలని, ప్రమాదబీమా, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మాధవి, సుధ, రమ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో అప్పయ్యకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా కార్యర్తలు

త్వరలో వరంగల్‌కు సీఎం



హనుమకొండ సిటీ, జనవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. అసెంబ్లీ సమావేశాల తరువాత ఆయన రానున్నట్లు తెలిసింది. పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇటీవలే 'కుడా'లో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కొండా సురేఖ సూత్రప్రాయంగా రేవంత్‌రెడ్డి పర్యటనను వెల్లడించారు. త్వరలోనే ఆయనను నగరానికి తీసుకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ వర్గాల్లో కూడా రేవంత్ పర్యటన అంశం చర్చలో ఉంది. మేడారం జాతర.. ఆపై లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ప్రకటన కాక ముందే రేవంత్‌రెడ్డిని వరంగల్ నగరానికి తీసుకురావాలనే యోచనలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందుకు అనుగుణంగా మేడారం జాతరకు ముందే తీసుకువచ్చి అభివృద్ధి పనులను ప్రారంభింప చేయడం సరైనదిగా భావిస్తున్నారు.



భూపాలపల్లిలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

కాకతీయఖని, ఫిబ్రవరి 6: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్కా సుమన్ దిష్టిబొమ్మను సింగరేణి భూపాలపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు దహనం చేశారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం ఈ నిరసన కార్యక్రమం జరిగింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి పసునూటి రాజేందర్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రిపై బాల్కా సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సుమన్ వెంటనే బహిరంగ క్షమా పణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను విమర్శించే నైతికత ఆయనకు లేదని విమర్శించారు. ఉద్యమ సమయంలో అమాయకపు విద్యార్థుల జీవితాలతో చెలగాటమా డిన సుమన్ రేవంత్‌ను దూషించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు బుచ్చయ్య, బండి శ్రీనివాస్ యాదవ్, రఘుపతిరెడ్డి, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు

ములుగు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కా సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ములుగు పోలీస్ స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బానోతు రవిచందర్ మాట్లాడుతూ అత్యున్నత పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డిపై సుమన్ వ్యాఖ్యలు చేయడం హేయమని విమర్శించారు. అహంకారం తలకెక్కిన సుమన్ దుర్భాషలాడాడని, వెంటనే తన తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే యూత్‌కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎల్లావుల అశోక్‌యాదవ్, కుక్కల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఎల్‌ఎల్‌బీ పరీక్షల ఫీజు గడువు 17

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సుల 3, 5, ఐదేళ్ల కోర్సుల 3,7,9 సెమిస్టర్ల పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంలో ఫిబ్రవరి 20 వరకు ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఎల్‌ఎల్‌ఎం కేయూ మూడో సెమిస్టర్ పరీక్షల ఫీజులను చెల్లించుకోవాలని అధికారులు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్), ఎంబీఏ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులందరు ఫీజులు చెల్లించుకోవాలని రూ.250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 20 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇద్దరు బీటెక్ విద్యార్థులపై కత్తితో దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని పోచమ్మకుంట సగరకాలనీలో అద్దెకు ఉంటున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులపై ఒకరు కత్తితో దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఇదిగాని జెడ్సన్, గీసుగొండకు చెందిన కోల అరవింద్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు చెందిన తాటిపల్లి సుమంత్‌లు పోచమ్మకుంటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. కాగా, వారు ఉంటున్న ఇంటి సమీపంలో మరో ఇంటిలో పాముకుంట్ల రాకేశ్ అనే విద్యార్థి అద్దెకు ఉంటున్నాడు.

ఈ క్రమంలో రాకేశ్ సోదరుడు రాజ్‌కుమార్ తమ్ముడిని చూసేందుకు సోమవారం వచ్చాడు. రాత్రి మద్యం సేవించిన తర్వాత తమ్ముడు ఉంటున్న గదిలో గట్టిగా అరవడం, అక్కడకు వచ్చిన వారిని దుర్భాషలాడి అల్లరి చిల్లర చేశాడు. ఇమేమిటని బయటకు వచ్చిన జడ్సన్, అరవింద్, సుమంత్‌లను హేళన చేస్తూ ఎందుకు వచ్చారు? చంపేస్తా..? అని బెదిరిస్తూ నానా దుర్భాషలాడాడు. భయపడి ముగ్గురు గదిలోకి వెళ్లగా వారి ఉంటున్న గదిలోకి రాజ్‌కుమార్ బలవంతంగా ప్రవేశించాడు. కూరగాయలు కోసేందుకు ఉపయోగించే కత్తితో దాడికి దిగాడు. అరవింద్‌ను కత్తితో చాతిలో గట్టిగా పొడిచాడు. అడ్డుకునేందుకు వెళ్లిన సుమంత్ చేతిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర కత్తి గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. రక్తం మడుగులో ఉన్న అరవింద్‌ను 108 సహాయంతో చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. జెడ్సన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

జనగామలో బెల్టుషాపుపై దాడులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: జనగామలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.6వేల విలువ గల వివిధ రకాలైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణం వీవర్స్‌కాలనీలో ఉంటున్న రంగు నాగయ్య అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యాన్ని పట్టుకున్నారు. నాగయ్యను అరెస్టు చేసి విచారించారు.


మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీలత

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్

ఈనెల 18 నుంచి నిరంతరం బస్సులు నడిపిస్తాం..

'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత


మేడారంలో సిద్ధం చేస్తున్న బస్టాండ్ ప్రాంగణం

హనుమకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గతంలో కన్నా ఈ సారి మరిన్ని ఎక్కువ బస్సులను నడపబోతోంది. ప్రతీసారి మేడారం జాతరకు కోటి మందికిపైగా భక్తులు తల్లుల దర్శనానికి వస్తారు. వీరిలో 20 లక్షల మందికిపైగా ఆర్టీసీ బస్సుల్లోనే వనదేవతల సన్నిధికి చేరుకుంటారు. ఈ సారి మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నందు వల్ల మహిళలు మరింత ఎక్కువ సంఖ్యలో జాతరకే రావచ్చునని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు ఏర్పాట్లను కూడా విస్తృతంగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బస్సు ప్రయాణ ఏర్పాట్లపై ఆర్టీసీ వరంగల్ రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

ఆరు వేల బస్సులు

మేడారం జాతరకు ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 41 ఆపరేషన్ పాయింట్ల నుంచి ఆరువేల బస్సులను నడపనున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 9 డిపోల పరిధిలో 17 పాయింట్ల నుంచి 2500 బస్సులను నడుపుతాం. 2022లో రాష్ట్రవ్యాప్తంగా 2800 బస్సులనే నడిపాం. కరోనా వల్ల భక్తుల రద్దీ లేకపోవడంతో బస్సుల సంఖ్య కూడా తగ్గింది. ఈసారి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఇంకా ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాం. ఆ మేరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రతగా బస్సుల సంఖ్యను కూడా పెంచుతున్నాం. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో మహిళలు పెద్ద సంఖ్యలో రానున్న వారి కోసం ప్రత్యేకంగా బస్సులను నడపడం అంటూ ఏమీ ఉండదు.

ఈ నెల 18 నుంచి బస్సులు

ఈనెల 18 నుంచి మేడారానికి బస్సులు క్రమంగా నడుపుతాం. ఇప్పటికే జాతరకు బస్సులు నడుపుతున్నాం. ప్రతీ రోజు 50 బస్సులు మేడారానికి వెళుతున్నాయి. ప్రతీ బుధ, ఆదివారాల్లో 79 బస్సులు వెళుతున్నాయి. జాతర ముగిసే వరకు బస్సుల నడుస్తాయి. అప్పటి వరకు అన్ని రూట్లలో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈ సారి 40లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం.

55 ఎకరాల్లో బస్‌స్టేషన్

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి మేడారంలో బస్‌స్టాండ్‌ను కూడా మరింత విశాలంగా ఏర్పాటు చేస్తున్నాం. ఇది వరకు 40 ఎకరాల్లో బస్‌స్టాండ్ ఏర్పాటు చేసేది. ఈ సారి అదనంగా మరో 15 ఎకరాల స్థలం అదనంగా తీసుకున్నాం. మొత్తం 55 ఎకరాల్లో బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నాము. క్యూలైన్లను కూడా పెంచుతున్నాము. ఇదివరకు బస్‌స్టాండ్‌లో 39 క్యూలైన్లు ఉండేది. ఈసారి ఈ సంఖ్యను 45కు పెంచుతున్నాం. బస్టాండ్‌లో భక్తుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా తాగునీటి కోసం రెండు ఆర్‌వోఆర్ ప్లాంట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఇందులో ఒకటి బస్‌స్టాండ్, రెండోది క్యూలైన్ల వద్ద ఉంటుంది. ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు, తగిన మార్గదర్శనం నెరిపేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా తీసుకుంటున్నాం. బస్‌స్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం 80 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నాం.

పార్కింగ్‌కు అదనపు స్థలం

ఈ బస్సు సంఖ్య పెంచినందువల్ల పార్కింగ్ సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. మేడారంలో బస్‌స్టాండ్‌లో 2వేల బస్సులు నిలిచేందుకు మాత్రమే స్థలం ఉంది. మిగతా బస్సుల పార్కింగ్ కోసం కామారం వద్ద 18 ఎకరాలతో అదనంగా మరో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. బస్‌స్టాండ్‌లో బస్సులు ఖాళీ అవుతుంటే కామారంలో పార్కింగ్ చేసిన బస్సులను ఇక్కడికి పంపిస్తాం. దీనివల్ల బస్‌స్టాండ్‌లో ఒత్తిడి తగ్గుతుంది. రద్దీ సమస్య ఉండదు.

రీజియన్ నుంచి 50 శాతం సర్వీసులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని మొత్తం 741 బస్సుల్లో 365 బస్సులను మేడారం స్పెషల్‌గా నడుస్తున్నాయి. మిగతావి రీజియన్ పరిధిలోనే ఆయా డిపోల పరిధిలోని జాతర బస్ పాయింట్ల వద్దకు ప్రయాణికులను చేరవేయడానికి నడుస్తాయి. జాతరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులే నడుస్తాయి. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి సూపర్ ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సులు నడుస్తాయి.

150 కొత్త బస్సులు

జాతర కోసం ప్రస్తుతం ఉన్నవాటితో పాటు 150 కొత్త బస్సులను కూడా నడపనున్నాం. వరంగల్ రీజియన్‌కు 50 కొత్త బస్సులు వచ్చాయి. వీటితో పాటు అదనంగా మరో 100 కొత్త బస్సులను జాతరలో నడపాలని నిర్ణయించుకున్నాము. కొత్త బస్సులు ఈ నెల 18 నుంచి జాతర భక్తులకు అందుబాటులోకి వస్తాయి.

15వేల సిబ్బంది

జాతరలో బస్సుల నిర్వహణకు 15వేల మందిని నియమిస్తున్నాం. డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ ఆఫీసర్లు, ట్రాఫిక్ అధికారులు, మెకానిక్‌లు తదితర సిబ్బంది వీరిలో ఉంటారు. బస్సుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం.

నాలుగు చోట్ల మెకానికల్ క్యాంపులు

జాతరలో సాంకేతిక సమస్యలు తలెత్తి మార్గమధ్యలో ఎక్కడైనా బస్సులు నిలిచిపోయిన పక్షంలో తక్షణం అక్కడకు చేరుకొని వాటికి మరమ్మతులు చేసేందుకు నాలుగు చోట్ల - మేడారం, తాడ్వాయి, పస్రా, గట్టమ్మ వద్ద మెకానికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కొక క్యాంపులో ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు ఉంటారు. వీరు ఎక్కడ బస్సు నిలిచిపోయినా తక్షణం అక్కడి వెళ్లి వాటిని బాగు చేస్తారు. బాగుకాకపోతే ఆ బస్సును క్రేన్ సహాయంతో పక్కన పెడతారు. పన్నెండు మొబైల్ వ్యాన్ల (డీజీబీ)ను కూడా తాడ్వాయి, నార్లాపూర్, పస్రా, గట్టమ్మ దేవాలయం, ఘనపూర్, కాటారం తదితర ప్రాంతాల్లో ప్రతీ 25 కి.మీ. ఒకటి చొప్పున అందుబాటులో ఉంటాయి. ఈ మొబైల్ వ్యాన్లను బస్సును బాగు చేయడానికి అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంటాయి. చెడిపోయిన బస్సుల వల్ల బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాటిని ఎత్తి పక్కన పెట్టేందుకు రెండు క్రేన్లు, ఒక ట్రాక్టర్‌ను సైతం సిద్ధంగా ఉంచుతున్నాం. ఈ మొబైల్ వ్యాన్లలో ఉన్నవారి ఫోన్లను డ్రైవర్లకు, ఇతర సిబ్బందికి ఇస్తాం. వారు ఎక్కడైనా బస్సు ఆగిపోతే వారు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగానే మొబైల్ వ్యాన్ తక్షణం అక్కడి చేరుకొని బస్సుకు మరమ్మత్తు చేస్తుంది.

వైర్‌లెస్ సెట్లు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవి సాఫీగా ముందుకు సాగేలా చర్యలు తీసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తు న్నాం. ఇందుకోసం స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నాం. 15 జీపులు, 6 మోటార్ సైకిళ్లపై వీరు తిరుగుతూ బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటారు. వైర్‌లెస్ సెట్లద్వారా సమాచారాన్ని తెలుసుకుంటారు. ప్రతీ 25 కి.మీ. మధ్య ఒక స్క్వాడ్ నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. జాతర మార్గం మొత్తాన్ని ఈ స్క్వాడ్లు కవర్ చేస్తూ ఉంటాయి.

ట్రాకింగ్ పరికరాలు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను నిరంతరం గమనించేందుకు ట్రాఫిక్ డివైస్‌లను కూడా వినియోగిస్తున్నాం. హనుమకొండ -మేడారం మధ్యలో వీటిని ఉపయోగిస్తాం. తాడ్వాయి- మేడారం మధ్య ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా పనిచేసేదానిపై వీటి వాడకం ఉంటుంది. అయితే హనుమకొండ- తాడ్వాయి మధ్య మాత్రం ఇవి పని చేస్తాయి. హనుమకొండ ఆర్ఎం కార్యాలయంలోని సెంటర్ కామాండ్ సిస్టమ్‌లో ఈ ట్రాకింగ్ డివైస్‌లు అనుసంధానం అయి ఉంటాయి. బస్సులు ఎలా నడుస్తున్నాయి? ఎంత వేగంతో నడుస్తున్నాయి? ఎక్కడైనా నిలిచిపోయాయా? ఏదైనా బస్సుకు సమస్య వచ్చిందా? అనేది కమాండ్ కంట్రోల్ రూంలోని మానిటర్ల ద్వారా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాం. ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినా ఈ మానిటర్ల ద్వారా తెలుసుకోవచ్చు.

బస్ పాయింట్లు

మేడారం వెళ్లే భక్తుల కోసం నగరంలో, అన్ని డిపో కేంద్రాల్లో 17 బస్సు పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల వద్ద, అలాగే హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. జనగామలోని క్రిస్టన్ స్కూల్, స్టేషన్‌ఘనపూర్, తొర్రూ రు, వర్ధన్నపేట, మహబూబాబాద్, నర్సంపేట, కొత్తగూడ, పరకాల, చిట్యాల, ఘనపూర్, భూపాలపల్లి, కాళేశ్వరం, కటారం తదితర ప్రాంతాల్లో బస్సు పాయింట్లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ప్రయాణికులతో బస్సులు నిండగానే వెంట వెంటనే బయలుదేరుతాయి.

మేడారం ప్రధాన ద్వారం ముస్తాబు

తాడ్వాయి, ఫిబ్రవరి 6: మండలకేంద్రంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రధాన ద్వారాన్ని రంగు రంగులతో ముస్తాబు చేస్తున్నారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 21నుంచి 24వతేదీ వరకు జరిగే మహాజాతర సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గల మేడారం ఆర్చ్, గేటుకు రంగురంగులతో సమ్మక్క-సారలమ్మ దేవతల విగ్రహాలకు, సలహారానికి ముస్తాబు చేస్తున్నారు. ఈఏడాది అమ్మవార్లను దర్శించుకునేందుకు లక్షలాదిమంది భక్తులు తరలిరానుండడంతో ఈప్రాంతాన్ని అధికారులు శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. తాడ్వాయిలో ఎక్సైజ్, పోలీస్, ఆర్టీసీ, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర విభాగాల అధికారులు వారంరోజులపాటు ఉండేందుకు బస ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. మరో వారంరోజుల్లో ఏర్పాటుచేసిన బస కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఏది ఏమైనప్పటికీ బుధవారం నుంచి మేడారం జాతర ఆరంభానికి నాంది పలుకుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తూ అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.


తాడ్వాయిలో ముస్తాబు అవుతున్న తోరణం


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వన దేవతలకు భక్తుల మొక్కులు

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం మహాజాతరకు ముందుగా తరలివస్తున్న భక్తులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం 30వేలకుపైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి గద్దెల వద్దకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాట మొక్కులు తీర్చుకుని మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేశారు.

ములుగును సమ్మక్క సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలి



మేడారం, ఫిబ్రవరి 6: ములుగుకు వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, తుడుందెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజాల భిక్షపతి అధ్యక్షతన మేడారంలోని హరిత హోటల్ ప్రాంగణంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లాకు వనదేవతల పేర్లను అధికారికంగా ప్రకటించాలన్నది ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. గత ఏడాది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క, సారలమ్మ సన్నిధి నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారని, ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు సమ్మక్క, సారలమ్మల పేరును అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో నూతనంగా ఏర్పడిన కొన్ని జిల్లాలకు ఆయా ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాల పేర్లు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్, ఉపాధ్యాయుల సంఘం, నగరభేరి రాష్ట్ర కార్యదర్శి పోరిక ఉదయ్ సింగ్, పలు సంఘాల నాయకులు శ్రీనివాస్, నవీన్, వేణు, చింత కృష్ణ, శ్రావణ్, కృష్ణప్రసాద్, మహేష్, రత్నం, పూజారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సందర్శించిన డీఎంహెచ్‌వో


వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో అప్పయ్య

మేడారం, ఫిబ్రవరి 6: తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సందర్భంగా పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య శిబిరాలను జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అల్లెం అప్పయ్య మంగళవారం సందర్శించారు. వైద్య సేవల రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మంగళవారం వరకు 3,250 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. చికిత్స పొందిన భక్తుల్లో అధికంగా గొంతు నొప్పి, జలుబు, జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలతో వచ్చిన వారు ఉన్నారని అన్నారు. వారికి అవసరమైన మందులు అందించామని తెలిపారు. ఆది, బుధవారాలు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న దృష్ట్యా అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, ఫిబ్రవరి 6: పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి పర్చడమే తన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కొత్తపేటలో రూ. 50 లక్షలు, చింతకుంటరామయ్యపల్లి, చల్లగరిగలో రూ. 20లక్షలు, జడల్‌పేట, చిట్యాల, పాశిగడ్డతండా, వరికోల్‌పల్లి గ్రామాల్లో రూ. 10లక్షలు, దూత్‌పల్లి, ఒడితల, బావుసింగ్‌పల్లి, ముచినిపర్తి గ్రామాల్లో రూ. 5లక్షల చొప్పున నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్లు, గోపాలపురంలో రూ. 25 లక్షలతో చేపడుతున్న నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపనలు చేశారు. చిట్యాల, కొత్తపేట గ్రామాల్లో రూ. 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వారి గోడును ఆలకించిన ఆయన ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు.

జడల్‌పేట, భీష్మనగర్ ప్రభుత్వ పాఠశాలలను ఎమ్మెల్యే సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్‌హాల్, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో బోర్ మోటార్, తరగతి గదులు, మరుగుదొడ్ల మరమ్మతు, అంగన్‌వాడీ భవనంలో పలు సమస్యలను ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తన ప్రత్యేక నిధుల నుంచి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్‌ఈ రషీద్ షేక్, ఈఈ దిలీప్, ఎంపీడీవో రామయ్య, తహసీల్దార్ సుమన్, పీఆర్ ఏఈ తిరుపతి, మాజీ సర్పంచ్‌లు ముకిరాల మధువంశీకృష్ణ, రత్నాకర్‌రెడ్డి, గజ్జి రవి, సాంబలక్ష్మి, కవిత పాపిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గూట్ల తిరుపతి, కొమరయ్య, మాజీ జడ్పీటీసీలు కాత్రేవుల సాయిలు, ఓరం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు పెద్ద పీట

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, ఫిబ్రవరి 6: బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. త్వరితగతిన కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం వారి వాటా నిధులు కేటాయించడానికి ప్రభుత్వం పూనుకుంటుందని తెలిపారు. కాటారం మండల కేంద్రంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ ప్రముఖుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని మంత్రి మంగళవారం ఆవిష్కరించారు. తిమ్మన్నకుంటలో రూ.3 లక్షల సీడీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాటారంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరిట పద్మశాలీ భవనం ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా త్వరలోనే రెండింటిని అమలు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

గృహజ్యోతి సర్వే పరిశీలన

అర్హులైనవారికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడానికి ఉద్దేశించిన గృహజ్యోతి పథకం సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. కాటారం జీపీ పరిధిలోని ఒకటో వార్డులో ట్రాన్స్‌కో ఎస్ఈ మల్సూరునాయక్ నేతృత్వంలో డీఈ నాగరాజు కాటారం ఏడీఈ డీ నాగరాజు, ఏఈ మేఘనాథ్, ఏవో లక్ష్మీనారాయణ, విద్యుత్ సిబ్బంది చేపట్టిన గృహజ్యోతి సర్వేను మంత్రి పరిశీలించారు. దరఖాస్తుల సందర్భంగా కొందరు మీటర్, ఆధార్ నెంబర్లు తప్పుగా ఇచ్చారని తెల్సిందని, క్షేత్రస్థాయి సర్వేలో అర్హులైన వారందరికీ ఉచిత విద్యుత్ అందేలా చూడాలన్నారు. కిరాయికి ఉన్న అర్హులైన వారికి సైతం ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. మండలకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి మంత్రి ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం ఆర్డీవో కార్యాలయానికి కేటాయించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. ప్రభుత్వం రూ.50లక్షలు మంజూరు చేసిందని, మొదట భవనానికి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తెచ్చి నూతన భవన నిర్మాణం సైతం చేపట్టాలని అన్నారు. ఆర్డీవో కార్యాలయానికి తాత్కాలికంగా వేరే భవనాన్ని పరిశీలించడానికి నిర్ణయించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఆర్డీవో డాక్టర్ కే నారాయణ, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ మహేశ్వరి, ఎంఎస్‌వో సంజీవరావు, ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ నాగరాజు, పద్మశాలీ సంఘం నేతలు సమ్మయ్య, బలరాం, రమేష్, సుజాత, రాజేందర్, సత్యనారాయణ, గట్టయ్య, పలువురు కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

జాతీయ కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థిని గెలిపించుకునేందు కోసం నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో దశాబ్దాల కలలు సాకారం చేశారని, భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను 75 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేతకు గురిచేసిందని అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయని, అయోధ్యలో రామమందిరానికి పునర్‌వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుచేసి రూ.900కోట్లను బడ్జెట్‌లో కేటాయించిన ప్రభుత్వం బీజేపేనని వెల్లడించారు. రాబోయే రోజుల్లో మేడారం మహాజాతరను జాతీయం చేసేవిధంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు భూక్య రాజునాయక్, గాజుల కృష్ణ, నగరపు రమేష్, జవహర్‌లాల్, రవింద్రచారి, చల్లూరి మహేందర్, రవిరెడ్డి, కిషోర్, కృష్ణాకర్‌రావు, కొత్త సురేందర్, గాధం కమార్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

జంపన్నవాగులో యువకుడి గల్లంతు

మేడారం, ఫిబ్రవరి 6: వనదేవతల దర్శనానికొచ్చిన మేడారం వచ్చిన ఓ యువకుడు జంపన్నవాగులో గల్లంతైన సంఘటన మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని దీపక్‌నగర్‌కు చెందిన పోలవేణి స్వాగత్(23) కుటుంబ సభ్యులతో కలిసి మేడారం వచ్చాడు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం కుటుంబసభ్యులంతా జంపన్నవాగు జంట వంతెనల వద్ద విడిది చేసిన క్రమంలో స్వాగత్ రెడ్డిగూడెం కాజ్‌వే సమీపంలో ఉన్న పాలమడుగులో ఈతకు దిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సీఐ శంకర్, తహసీల్దార్ రవీందర్ సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో వలలతోనూ ప్రయత్నాలు చేశారు. కానీ రాత్రి వేళ వరకు అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.


రైతు ఆత్మహత్య



మొండి (ఫైల్)

మహదేవపూర్, ఫిబ్రవరి 6: అప్పుల బాధతో ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...

మండలంలోని పలుగుల గ్రామానికి చెందిన ఎలిశెట్టి మొండి (46) తనకున్న నాలుగెకరాల భూమిలో పత్తి పంట వేశాడు. దీనికి రూ. 2 లక్షల అప్పు చేశాడు. పంట సరిగా పండక అప్పులు అలాగే మిగిలిపోయాయి. దీంతో మనస్తాపం చెందిన మొండి పత్తి చేను వద్దే చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కాళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి

ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

మహదేవపూర్, ఫిబ్రవరి 6: ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించొచ్చని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని పలు పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. బాలుర, బాలికల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో దేవానాయక్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గణపురం : విద్యార్థులు ఇష్టంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చెల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో గల 4,538 మంది విద్యార్థులకు 36రోజుల పాటు అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామ్‌కుమార్, ఏసీజీఈ రవీందర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏడీ రాజేందర్, అసిస్టెంట్ సెక్రటరీ భద్రయ్య, హెచ్‌ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్!

5వ పేజీ తరువాయి

పోటాపోటీగా సిఫారసు లేఖలు ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసుల బదిలీల్లో రాజకీయం జోక్యం మితిమీరిపోతుండటం చర్చనీయా శంగా మారింది. ప్రతీ జిల్లాలో ఎమ్మెల్యేలు ఒక పేరు సూచిస్తే.. మంత్రులు ఇంకో పేరు సూచిస్తూ సిఫార సు లేఖలను పోలీసు ఉన్నతాధికారులకు అంద జేస్తున్నారు. దీంతో 'కరవమంటే కప్పకు.. విడవ మంటే పాముకు కోపం' అన్న చందంగా పోలీసు పైరవీలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. మంత్రుల సిఫారసు లేఖలను అమలు చేయాలా? ఎమ్మెల్యేల లేఖలకు విలువ ఇవ్వాలా? తెలియక ఉన్నతాధికారులు బదిలీపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారట. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఐ, ఏసీపీ, డీసీపీల బదిలీలంటూ నాలుగైదు రోజులుగా ప్రచారం జరుగుతున్నా అర్డర్స్ మాత్రం బయటకు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం రాజకీయ ఒత్తిళ్లే కారణమనే చర్చ జరుగుతుండగా.. ఒకేసారి భారీగా బదిలీలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు పోలీసు అధికారులు కూడా తమకు ఇష్టమైన పోస్టింగు కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి దగ్గరి వారికి వారు పోస్టింగుల కోసం సిఫారసు లేఖలు ఇస్తున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య అంతర్గతంగా వాగ్వాదం జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ క్రమంలో ఓ ఎమ్మెల్యే 'నా నియోజకవర్గంలో వేలు పెడితే ఊరుకునేదే లేదు. నీకు దండం పెడుతా నా పని నన్ను చేసుకోనివ్వు' అంటూ మంత్రితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. కాగా, రాజకీయ నేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో పార్లమెంట్ ఎన్నికల వరకు ఎలాంటి బదిలీలు వద్దని జిల్లా, కమిషనరేట్ పోలీసు బాసులు పై అధికారులకు సూచిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య బదిలీలపై మనస్పర్థలు పెరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బదిలీలపై ఆశతో ఉన్న పోలీసు అధికారులకు ఇప్పట్లో బదిలీలు ఉంటాయా.. లేక మేడారం మహాజాతర, పార్లమెంట్ ఎన్నికల వరకు వేచి చూడాల్సిందేనా అనే ఉత్కంఠతో ఉన్నారు.

ప్రత్యేక అధికారులు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 6: గ్రామ పంచాయతీ విధులను ప్రత్యేక అధికారులు పకడ్బందీగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీల స్పెషల్ అధికారులతో ఆయన మంగళ వారం సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. బుధవారం నుంచి 15 తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీపీవో ఆశాలత, జడ్పీ సీఈవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

'1104' క్యాలెండర్ ఆవిష్కరణ

గణపురం, ఫిబ్రవరి 6: కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు 1104 యూనియన్ క్యాలెండర్, డైరీని సీఈ కాన్ఫరెన్స్ హాల్‌లో సంఘం జెన్కో అధ్యక్షుడు కంటే రాజేందర్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్‌రావు, సీఈ సిద్ధయ్య చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. కేటీపీపీ రీజనల్ నాయకులు ఊరుగొండ సమ్మయ్య, సెక్రటరీ కనకరాజు, స్టేట్ ఉపాధ్యక్షుడు వంగ కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, అనంతరామయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుల్లో పురోగతికి ముందడుగు

భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో ఎస్పీ శబరీశ్



భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: పోక్సో రేప్ కేసుల్లో పురోగతి సాధించేదిశగా పోలీస్‌శాఖ ముందడుగు వేస్తుందని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ములుగులో 1400చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు గదులతో నూతనంగా ఏర్పాటుచేసిన భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా లైంగిక వేధింపులకు గురైన మహిళలు, పిల్లలకు సమగ్ర మద్దతు అందించడం, మానసిక చికిత్స, కౌన్సెలింగ్, మెడికల్, లీగల్ ప్రాసిక్యూషన్ సేవల ద్వారా సమగ్రపద్ధతిలో సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. అత్యాచారం, పోక్సో చట్టం కేసుల బాధితులందరూ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసిన తర్వాత వైద్యపరీక్షలు తప్పనిసరి నిబంధనల కోసం భరోసా కేంద్రాలకు పంపబడిందని, దీనిని 161, 164ఐపీసీ ప్రకారం మహిళా ఎస్సైచే రికార్డు చేయబడుతుందని అన్నారు. భరోసా కేంద్రానికి డీసీఆర్‌బీ డీఎస్పీ ఎస్.సుభాష్‌బాబు నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వసుధ, సీడబ్ల్యూవో ప్రేమలత, డీసీపీవో ఓంకార్, ఎస్సై కమలాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని, ఎన్ని సమస్యలు ఎదురైనా అనుకున్నది సాధించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. ములుగులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌లో ఎంపికై రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిన ఏటూరునాగారం మండలం రామన్నగూడెం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, గైడ్ టీచర్ శ్యాంసుందర్‌రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కొయ్యడ మల్లయ్య, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్‌ను ఆమె శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి లక్ష్య సాధనకు కృషి చేస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని అన్నారు. ఉపాధ్యాయులు మరిన్ని నూతన ఆవిష్కరణల కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, ద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 6 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఏటూరునాగారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. ఈనెల 4న ఖమ్మంలో పోటీలు జరిగాయి. అండర్ - 17 బాలికల 50 కేజీ విభాగంలో ఏటూరు నాగా రానికి చెందిన చామర్తి ఐశ్వర్య బంగారం పకకం సాధించి గ్రాండ్ చాంపియన్‌గా నిలించింది. అండర్ - 17 బాయ్స్ - 45 కేజీ విభాగంలో ఎమ్డీ. తౌఫిఖ్ బంగారం పతకం సాదించాడు. అండర్ - 14 బాయ్స్ - 35 కేజీ విభాగంలో ఏటూరునాగారానికి చెందిన వసంత విశాల్ సాయి బంగారు పతకాలను సాధించాడు. ఈ మేరకు ఏటూరునాగారం కరాటే అకాడమీ కోచ్ ఎమ్డీ. అబ్బు, కోచ్ ఎమ్డీ. హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎం వి.సాంబశివరావు, పాఠశాల పీఈటీ సి.హెచ్. రవి, కోచ్ అబ్బు, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఖమ్మం పట్టణంలో ఈనెల 11,12 తేదీల్లో జరిగే తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్య, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య కోరారు. ములుగులో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరాలు లేని విద్య ప్రజల హక్కు, ప్రభుత్వ బాధ్యత ప్రధానాంశంగా కామన్‌స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో మహాసభలు జరుగనున్నాయన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాల ఉప్పస్వామి, శ్యాంసుందర్, ధర్మయ్య, కళ్యాణి, స్వప్న, సుశీల తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 6: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో విద్యార్థులకు మహిళల భద్రతపై షీటీమ్స్ అందిస్తున్న సేవలపై ఆ విభాగం పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. షీటీమ్స్ సీఐ అజయ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆపద సమయంలో 8712658162 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. సైబర్ నేరాల పట్ల కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో షీటీమ్ సభ్యులు దేవేంద్ర, సాజిద్, శిరీష, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం

సింగరేణి డిప్యూటీ జీఎం (పర్సనల్) తుకారాం

కాకతీయఖని, ఫిబ్రవరి 6: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమని సింగరేణి భూపాలపల్లి ఏరియా డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) అజ్మీరా తుకారాం అన్నారు. పట్టణ పరిధి సుభాష్‌కాలనీలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న పైనరింగ్ క్యాంప్ క్రాఫ్ట్ శిక్షణ శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు శ్యాంప్రసాద్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

170 లీటర్ల గుడుంబా పట్టివేత

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం 170 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు మహదేవపూర్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన వావిళ్ల లక్ష్మి, గుజ్జుల నీలమ్మ తమ ఇళ్లల్లో గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేటీకే-5వ గనిని సందర్శించిన ఓఎస్‌డీలు



కేటీకే-5వ గని ఓఎస్డీలు

కాకతీయఖని, ఫిబ్రవరి 6: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5వ గనిని కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ కొత్తగూడెం ఓఎస్డీ సుబ్రమణ్యం, కోల్‌కత్తా ఓఎస్డీ ముకోపాధ్యాయ మంగళవారం సందర్శించారు. గనిలోని ఫైర్ సీల్, గని ఆవరణలోని ఫిల్టర్ బెడ్, ఉపరితల నిర్మాణాలను, ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కార్మికులకు పని స్థలాల్లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారి వెంట సింగరేణి అధికారులు తిరుపతి, పోషమల్లు, రామరాజు, రాజశేఖర్, కృష్ణప్రసాద్, జాకీర్‌హుస్సేన్ ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతులకు చేయూత

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 6: దళిత, గిరిజన రైతులకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్) ఆధ్వర్యంలో రైతులకు చేయూతనందించడం అభినందనీయమని సబ్ రిజిస్ట్రార్ రంజిత్‌రాయ్ అన్నారు. మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులకు స్ప్రింకర్లు, వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టగా సబ్ రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుమారు 66కుటుంబాలకు రూ.15.20 లక్షల విలువ గల పనిముట్లను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ సుబ్రహ్మణ్యం, పద్మ, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాంబవ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 6: జాంబవ కుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను మంగళవారం ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు మచ్చ భద్రయ్య, ముఖ్య కార్యదర్శి కొడెపాక శంకర్, నాయకులు రాజమౌళి, రాజం, ఐలయ్య, మహేష్, మధు, కుమార్, సారయ్య, పోశం, తిరుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములను పేదలకు పంచాలి : నాగయ్య

వాజేడు, ఫిబ్రవరి 6: రాష్ట్రవ్యాప్తంగా లక్షల్లో ఉన్న మిగులు భూములను పేదలకు పంచాలని, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు అందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుడిసెల కేంద్రంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు రెండురోజులుగా జరుగుతుండగా మంగళవారం నాగయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సన్నరకాల విత్తనాలను ఉత్పత్తి చేయాలి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేశవులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 6: మండలంలోని రైతులు అధిక దిగుబడులను ఇచ్చే సన్నరకాల విత్తనాలను ఉత్పత్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేశవులు అన్నారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలో విత్తన ఉత్పత్తి రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతాంగానికి ఆధునిక పద్ధతిలో మేలైన అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను అందించాలని సంస్థ కృతనిశ్చయంతో ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజలకు వినియోగంలో ఉన్న సన్నరకాలను మేలైన వాటిని ఉత్పత్తిచేసి విత్తన ఉత్పత్తి రైతులు సంస్థ ద్వారా అందించాలని పేర్కొన్నారు. ఎ అనంతరం మండలకేంద్రలోని తెలంగాణ రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఎం.ఆదినారాయణరెడ్డి, వరంగల్ రీజియన్ మేనేజర్ రఘు, ఫీల్డ్ ఆఫీసర్ భిక్షపతి, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 6: భూపాలపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ సేవలు ఇక నుంచి జిల్లాలో ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా పోలీసు బాస్ ప్రత్యేక దృష్టి సారించారు.